# కవితా కౌముది

## నీ ప్రేమ

పెరుగు రామకృష్ణ , నెల్లూరు

నిప్పు, నీరు, గాలి
పొదిగిన నీవు సంపూర్ణం..
సముద్రాన్ని చూసినప్పుడల్లా
నీ సౌందర్యమైన రూపం తెలుస్తుంది!
ఒక భీకర తుఫాన్ను
వీక్షించినప్పుడల్లా..
నీ ముఖంలో రంగులు స్పష్టమౌతాయి..
అందమైన శుభోదయాన్ని
తిలకించినప్పుడు
నేను ప్రేమించాల్సిన ముఖం, కళ్ళు
నాకు బోధపడ్డాయి..
అప్పుడు భూమి మొత్తం
సంతోషంతో పులకిస్తుంది..!

*బెంగాలీ-ఆంగ్ల మూలం: విప్లవ మాజీ, మిడ్నాపూర్*

***

# ఆ కన్నీళ్ళే

ఎమ్.వి.వి.ఎన్.సౌమ్య, గన్నవరం

ఆనంద బాష్పాలూ..కన్నీళ్ళూ..
ఎంత తేడా రెంటికీ!?
విజయాన్ని వడేసి పట్టుకున్నప్పుడు
కళ్ళనుండి దొర్లిన ముత్యాలు నీళ్ళే!
కష్టం నీడలా వెన్నంటే ఉంటే
కన్నులు విడిచే పాము కాట్లు కూడా నీళ్ళే!
ఎంత తేడా ఈ రెంటికీ!?
ఆనందంలో వచ్చే నీళ్ళు
అవే ..ఆనంద బాష్పాలు
అందరినీ ఇనుమడింప చేస్తే -
కష్టంలో వచ్చే కన్నీళ్ళంటే
అందరికీ ఈసడింపే !
కానైతే మాత్రం
సంతోషం, ఆనంద బాష్పాలతో పాటూ
ఎంతో మందిని చుట్టూ చేర్చినా..
దుఃఖంలో సానుభూతితో మన దగ్గరకు వచ్చేవి
మనం ఈసడించుకునే ఆ కన్నీళ్ళే!
మన దుఃఖ భారాన్ని తగ్గించేవీ ఆ కన్నీళ్ళే!!

***

# కాలంతో పోటీ

మాధవ్ దుర్భా

వడివడిగా సాగే కాలానికి
ఆనకట్టలు కట్టే నన్ను చూసి
రోజూ  వచ్చిపోయే నన్నేం చేస్తావని
మబ్బుల్లో దోబూచులాడాడు సూరీడు!
అరచేతిని అడ్డుపెట్టి అరుణోదయాన్ని ఆపేసి
సూరీడు పని పడదామన్న నా కోపం చూసి
మరి నా మాటేమిటనేసి
వెక్కిరిస్తూ  పరిభ్రమించింది కాలచక్రం..!
కాలచక్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్న నన్ను చూసి
ప్రశ్నించింది "వచ్చే ఏళ్ళా? పోయే ఏళ్ళా?" అని
నెరిసిన నా జుత్తు చూసి నవ్వుతూ నిలువుటద్దం!
జుత్తుకి రంగంటించి కాలాన్ని వెనక్కి తిప్పేసానని
ఇప్పుడేమంటావని ప్రశ్నిస్తుంటే అద్దాన్ని,
"వీలైతే మమ్మల్ని పట్టుకుని ఆపెయ్" అని
పోటీ పడ్డాయి చిన్న ముల్లూ, పెద్ద ముల్లూ!
గడియారంలో బేటరీ తీసేసి
ఊపిరి పీల్చుకుంటున్న నన్ను చూసి
"నెల మారింది పేజీ మార్చెయ్" అనేసి
గదమాయించింది గోడకున్న కేలెండరు!
వచ్చీపోయే ఋతువులూ, వద్దన్నా ఆగని సూరీడూ
వలస వెళ్ళే పక్షులూ, వికసించే పూలూ,
అన్నీ నన్ను ప్రశ్నిస్తున్నాయ్!
"ఎందుకీ తపనా?..ఏమిటీ ప్రయాసా?" అంటూ!
నడుస్తున్న కాలాన్ని ఆపేసి ఈ క్షణాన్ని ఆస్వాదిస్తానన్న నన్ను చూసి
నింగిని తాకే కెరటాలూ..నిప్పుని అంటే శలభాలూ..
దాహం తీర్చే ఎండమావులూ..చంద్రుడిలో కుందేలూ..
"మేమున్నాం నేస్తం నీకు తోడు.." అంటూ ధైర్యాన్నిస్తున్నాయ్!

***

# ప్రణయగీతం గరిమెళ్ళ నాగేశ్వరరావు, విశాఖ

నంద నందనా ఇది.. నా హృది బృందావనమున నీకై..
పూచిన పరువపు మరువపు పరిమళమ్ములే..!
నీ తనువు అణువణువున..జల్లుకు..అల్లుకు..పరవశించనీ..!!

నీ మురళీ రవమున పలికిన స్వరముల జతలో
అందెను నేనై సందడి చేసే ఆనందములో
అంతరంగమే, అంకితమయ్యే..కీర్తనకిది నా నర్తనలే..!

గోవర్ధనగిరి నెత్తికెత్తుకుని..గోవులు కాచిన లీలల వేళల
నలిగిన నీ కరమును..తలచిన నా మది తల్లడిల్లెరా..
మెత్తగ హత్తుకు ఒత్తి చూడనీ..నా ఎదపై..సేద తీరగా..!!

కాళియ మర్ధన తాండవ కేళిలో కందినవేమో..
కదిలి కదిలి నీ చరణయుగములు.. నా మదినదిలో
అడుగిడి..కడిగి..స్వాంతన పొందుము..ఒక పరి స్వామీ..!!

పూతన చన్నుల పూసిన విషము..అణిగీ అణగక..
దాగినదేమో..అధరము మాటున..
నా పెదవులలో సుధలు గ్రోలుతూ పరిహరించనీ..మనసారా..!!

పడమటి కొండల పానుపు పైనా..సప్తాశ్వాల స్వప్నసీమలో
వెన్నెల వెలుగై రేగిన కన్నె వలపిది..కాదనబోకుర..
వేకువ వేళకి ప్రణయ జగతిలో ప్రేమ కాంతినే ప్రసరిద్దాం..!!

***

# బాసుదేవుడు

**వసుంధర**

అతడి పేరు బాసు కాదు

మాది వంగ భాష కాదు

పేరేమైతేనేం భాషేమైతేనేం

మాకు మాత్రమతడు బాసు!

మారుతి కారులొ వస్తాడు

మారుతి రూపున ఉంటాడు

పొగిడామా శక్తి పెరుగదు

తెగిడామొ మన భుక్తి మిగలదు

పేరేమైతేనేం భాషేమైతేనేం

మాకు మాత్రమతడు బాసు!

మా అందరిలోకీ పొట్టి

ఐనా చూస్తాం తల ఎత్తి

ఆకాశంలోనే భాషిస్తాడు

ఐనా వింటాం తలదించి

పేరేమైతేనేం భాషేమైతేనేం

మాకు మాత్రమతడు బాసు!

అతడికి దేశం మనుషులు కారు

ఆతడికి దేశం మట్టీ కాదు

మనుషులందరిని మట్టిగ చేసే

మంత్రజపంతో మనగలవాడు

పేరేమైతేనేం భాషేమైతేనేం
మాకు మాత్రమతడు బాసు!

అతడి అవకరం నవ్వనివ్వదు
అతడి అవసరం స్థిమితముంచదు
అతడికి కోపం రానివ్వము
అతడి పాపం పండనివ్వము
పేరేమైతేనేం భాషేమైతేనేం
మాకు మాత్రమతడు బాసు!

పూలదండలేసాము
పూజలెన్నో చేసాము
నాస్తికులకు భక్తిని నేర్పిన
బాసుదేవుడతడు మాకు
పేరేమైతేనేం భాషేమైతేనేం
మాకు మాత్రమతడు బాసు!

***



# రసరేఖలు

## బచ్చోటి శ్రీధర్

ఆకసమ్మున భేరివాద్యములు మ్రోగి
ఇలకు హిమపాతమును ప్రకటించినట్లు
సైనికావళియై లేచి సకలజనము
యుద్ధమన్నట్లు సర్వసన్నద్ధమయ్యె



నభమదెల్లను ధవళవర్ణమ్ము దాల్చి
పుడమి నిండుగ హిమసుమమ్ములను రాల్చె
సభను దీర్చిన మింటి నక్షత్ర రాశి
తరలి దిగివచ్చి హిమములై ధరణి నింపె

నేల యెల్లను ధావళ్య నిలయమయ్యె
చెట్టు చేమలు తెల్లని చీర కట్టె
ఇంటి కప్పులు దాల్చె ను మింటి చాయ
అఖిల జగము తోచె హిమాలయమ్ము వోలె

ఇంట శృంఖలముల దాల్చి యిమడలేక
బయలుదేరితి నీ సహవాసమునకు
ధౌత వస్త్రమ్ము దాల్చిన ధరణి యెల్ల
శీతలమ్మయ్యె  దుర్గమక్షేత్రమయ్యె

ఎల్లరును తమ యిండ్ల బందీలు నేడు
ఇంటనుండియు మనసు నీ యింట నిలిచె
ప్రకృతి స్తంభించి నిర్బంధపరిచె నన్ను
బంధమెరుగని ప్రేమ నీ పంచ జేరె

****